# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-10-2023 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పలు ఆహార శుద్ధి పరిశ్రమలను ఈరోజు దృశ్యమాధ్యమం ద్వారా ప్రారంభించారు.
- తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల పంపిణీపై కృష్ణా ట్రిబ్యూనల్ ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణను ఏసీబీ కోర్టు రేపటికి వాయిదా వేసింది.
- వీధి వ్యాపారుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి స్వనిధి పథకం 50 లక్షల మంది లబ్దిదారులతో ఓ మైలురాయిని సాధించింది.
- విశాఖలోని రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ సంస్థ వరుసగా 5వ సారి ప్రతిష్టాత్మక నేషనల్ ఎనర్జీ లీడర్ అవార్డును దక్కించుకుంది.

========================

రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన ఆహారశుద్ధి, ఇథనాల్ పరిశ్రమల ద్వారా సుమారు 2 వేల కోట్ల రూపాయలకుపైగా పెట్టుబడులు రానున్నాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తెలియజేశారు. ఈరోజు తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి ఆయన 7 ప్రాజెక్టులకు భూమిపూజ నిర్వహించి, మరో 6 ప్రాజెక్టులకు దృశ్యశ్రవణ విధానంలో ప్రారంభించారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో 200 కోట్ల రూపాయలతో నాగార్జున ఆగ్రో కెమికల్స్, తూర్పుగోదావరి జిల్లా ఖండవల్లి వద్ద 150 కోట్ల రూపాయలతో రవళి స్పిన్నర్స్ యూనిట్ లతో సహా శ్రీ సత్యసాయి, అనంతపురం, తిరుపతి, బాపట్ల జిల్లాల్లో యూనిట్లను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 13 జిల్లాల్లో ఏర్పాటైన వివిధ పరిశ్రమలతో 6 వేల మందికి పైగా ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు. స్థానికులకే ఉద్యోగావకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల పంపిణీపై కృష్ణా ట్రిబ్యునల్ ఏర్పాటు చేసినట్టు కేంద్ర సమాచార, ప్రసార శాఖా మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. ఢిల్లీలో ఈరోజు జరిగిన కేంద్ర మంత్రి మండలి సమావేశ వివరాలను ఆయన పాత్రికేయులకు వెల్లడించారు. ఉజ్వల పథకం లబ్దిదారులకు వంట గ్యాస్ సిలిండర్ పై ఇచ్చే రాయితీని 200 నుండి 300 రూపాయలకు పెంచినట్టు పేర్కొన్నారు. తెలంగాణాలో జాతీయ పసుపు బోర్డు ఏర్పాటుతో పాటు సమ్మక్క సారక్క పేరుతో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం లభించిందని చెప్పారు. తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల వివాదం నేపథ్యంలో రాష్ట్రాల వాటాను తేల్చాలని ట్రిబ్యునల్‌కు ఆదేశించినట్టు కేంద్ర మంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖపట్నంలోని రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ సంస్థ (RINL)కు వరుసగా 5వ సారి ప్రతిష్టాత్మక నేషనల్ ఎనర్జీ లీడర్ అవార్డు లభించినట్టు స్టీల్ ప్లాంట్ అధికారులు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డును బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ, విద్యుత్ మంత్రిత్వ శాఖ అందించినట్టు వెల్లడించారు. ఏ పరిశ్రమ అయినా 5 సంవత్సరాల పాటు నేషనల్ ఎనర్జీ లీడర్ అవార్డును నిరంతరం గెలుచుకోవడం అరుదైన విజయమని వ్యాఖ్యానించారు. ఇంధన సంరక్షణ, ఇంధన సామర్థ్యం కోసం చేసిన కృషికి గుర్తింపుగా ఎనర్జీ మేనేజ్‌మెంట్‌లో ఎక్సలెన్స్ కోసం జాతీయ అవార్డును ప్రదానం చేస్తారని వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

వీధి వ్యాపారుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి స్వనిధి పథకం 50 లక్షల మంది లబ్దిదారులతో ఒక కీలక మైలురాయిని సాధించింది. పట్టణ వీధి వ్యాపారులను ప్రోత్సహించి, వారిని ప్రధాన ఆర్థిక రంగ స్రవంతిలోనికి తీసుకువచ్చేందుకు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ 2020 సంవత్సరంలో ఈ సూక్ష్మ రుణ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం పరిధిని విస్తృత పరచాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాల ఫలితంగా గడచిన మూడు నెలల కాలంలో 12 లక్షలకు పైగా వీధి వ్యాపారులు ఈ పథకంలోకి కొత్తగా చేరారు. ఈ పథకం కింది ఇప్పటివరకు మొత్తం 50 లక్షల మంది వీధి వ్యాపారులకు 8 వేల 6 వందల కోట్ల రూపాయల రుణం లభించింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణను ఏసీబీ కోర్టు రేపటికి వాయిదా వేసింది. ప్రభుత్వం తరఫున ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి, చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది ప్రమోద్‌కుమార్ దూబే వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు విన్న ఏసీబీ కోర్టు న్యాయమూర్తి విచారణను రేపటికి వాయిదా వేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం కృష్ణాపురంలో 52 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయనున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈరోజు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. 5 టన్నుల సామర్థ్యంతో రెడీ టు ఈట్ ఇన్‌స్టంట్ చట్నీ తయారు చేసే ఓరిల్ (ORILL) ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో ప్రభుత్వం ఈ మేరకు 3 సంవత్సరాలకు గాను అవగాహనా ఒప్పందం చేసుకుంది. ఈ యూనిట్ ద్వారా 150 నుంచి 200 మందికి ఉపాధి లభించనుంది.

========================

ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా జంతువుల సంక్షేమ ప్రమాణాలను పెంపొందించడం, జంతువులకు మానవాళికి మధ్య స్నేహపూర్వక సంబంధాలను ఏర్పరచడం లక్ష్యంగా ప్రతి సంవత్సరం అక్టోబరు 4వ తేదీన జరుపుతారు. ఈ సంవత్సరం "బిగ్ ఆర్ స్మాల్ లవ్ దెమ్ ఆల్" అనే ఇతివృత్తంతో ప్రపంచ జంతు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

========================

కోస్టల్ సెక్యూరిటీ ఎక్సర్‌సైజ్ - సాగర్ కవచ్ డ్రిల్ కార్యక్రమం ఈ నెల 10, 11 తేదీలలో శ్రీకాకుళంలో జరగనున్నట్టు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ జి. ఆర్. రాధిక తెలిపారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లపై ఈరోజు ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ కవచ్ డ్రిల్ కార్యక్రమానికి పటిష్టంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కోస్టల్ సెక్యూరిటీ సిబ్బంది, జిల్లా పోలీసులు అప్రమత్తంగా ఉంటూ సాగర్ కవచ్ డ్రిల్ ను విజయవంతం చేయాలని ఎస్పీ ఆదేశించారు.

========================

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి రెండు రోజుల పర్యటన నిమిత్తం రేపు ఢిల్లీకి బయలుదేరనున్నారు. రేపు ఉదయం 10 గంటలకు ఆయన ఢిల్లీకి బయలుదేరి, ఢిల్లీలోని జన్‌పథ్ నివాసానికి చేరుకుంటారని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. వామపక్ష తీవ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం ఎల్లుండి విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించే సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని తెలియజేసింది.

========================

విశాఖలో మహిళా ఎంట్రప్రెన్యూర్‌షిప్ వర్క్‌షాప్ ను రేపటి నుంచి రెండు రోజులపాటు నిర్వహించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీ సీఈవో టి.అనిల్ కుమార్ తెలిపారు. మహిళా పారిశ్రామికవేత్తల కోసం స్టార్టప్ ఇండియా, ఇన్నోవేషన్ సొసైటీతో కలిసి నిర్వహిస్తున్న ఈ స్టేట్ వర్క్‌షాప్‌లో వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేలా ప్రోత్సహించడం, అవసరమైన సహాయాన్ని అందించడం మొదలైనవి లక్ష్యంగా ఉంటాయని ఆయన తెలియజేశారు.

========================

దసరా శెలవల సందర్భంగా రద్దీని తట్టుకునేందుకు 5 వేలకు పైగా ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ తెలిపింది. ఈ నెల 13వ తేదీ నుంచి 26 వరకు ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. సాధారణ ఛార్జీలతోనే ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్టు ఆర్టీసీ వివరించింది.

========================

ఉత్తరాంధ్ర జిల్లాల యోగాసన పోటీలు ఈ నెల 29న విశాఖలోని యోగావిలేజ్‌లో జరగనున్నాయి. జిల్లా యోగ సంఘం, విశాఖపట్నం యోగ విలేజ్, ఆంధ్ర విశ్వవిద్యాలయాల సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో 8 సంవత్సరాల నుండి అన్ని వయస్సులకు చెందిన స్త్రీ, పురుషులు పోటీల్లో పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు.

========================

సనాతన ధర్మాన్ని కాపాడుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉందని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాద రావు అన్నారు. ఈరోజు ఆయన శ్రీకాకుళం జిల్లా అరసవిల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో ధర్మ ప్రచార వారోత్సవాలను

ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హైందవ ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేయడంలో భాగంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త నిర్వహణలో ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతీయ తపాలా కార్యాలయాల్లో లభించే వివిధ పొదుపు పథకాలపై అవగాహన కార్యక్రమం ఈరోజు తిరుపతిలో నిర్వహించారు. తిరుపతి పోస్టల్ సూపరింటెండెంట్ ఎం.డి.సాదిక్ ఈ ఉదయం రైల్వే స్టేషన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో తపాలా బీమా, సుకన్య సమృద్ధి అకౌంట్, మహిళ సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్, రికరింగ్ డిపాజిట్, టైం డిపాజిట్, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ అకౌంట్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్ తదితర పథకాల గురించిన వివరాలను తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =